చిన్న కథ

# పెద్ద మనసు

**- ఎ. జయశంకర్**



జంకుతూ నా ఆఫీసు గదిలోకి అడుగుపెట్టాడు కొత్త క్లయింటు. తెల్ల చొక్కా, సన్న పంచె, భుజంపై కండువా, నెరసిన తల, వడలిన దేహం... డెబ్భైయ్యేళ్ళుంటాయేమో!

నేను తలెత్తగానే వినయంగా నమస్కరించి, ''మీతో కాస్త చెప్పుకోవలసింది ఉంది లాయరుగారూ! ఇప్పుడు అవకాశ ముంటుందా?'' అని అడిగాడు.

ముందు కూర్చోమని కుర్చీ చూపించాను. ప్రయాసతో కూర్చున్నాడు. సమస్య ఏమిటని అడిగాను. ముసలితనం క్రుంగదీసిన గొంతును కూడదీసుకుని, చెప్పటం మొదలుపెట్టాడు.

ఆయనకొక కొడుకు కూతురూ. కూతురు పెళ్ళయి ప్రస్తుతం అమెరికాలో ఉంటోంది. కొడుకు, కోడలూ హైదరాబాదులో సాఫ్ట్‌వేరు ఉద్యోగాలు చేస్తున్నారు. కొడుకు అత్తవారిల్లూ హైదరాబాదే.

ఆయన భార్య ఇటీవలే మరణించింది. కొడుకూ, కూతురూ వచ్చి ఘనంగా కర్మకాండ జరిపించి ఎవరిళ్ళకు వారెళ్ళిపోయారు. తనీ ఊళ్ళో పదెకరాల ఆసామీ అయినా ఆ ఆస్తికెవరూ ఆశపడలేదు.

దసరా పండుగలోగా ఇల్లూ పొలమూ అమ్మి సిద్ధంగా ఉండమని, హైదరాబాదు తీసుకెళ్ళిపోతాననీ చెప్పి వెళ్ళాడు కొడుకు. ఇన్నాళ్ళూ సొంత ఊళ్ళో కాలు కొద్దీ తిరిగి, గొడ్డు గోదాతో మసలి, యింటికి వచ్చిపోయే ఇరుగు పొరుగు వారికి కలిగినదాంట్లోంచే కాస్త పెట్టి, ప్రశాంత జీవితాన్ని గడిపిన తాను ఇప్పుడీ చివరి రోజుల్లో హైదరాబాదు పోయి బతకలేనని ఆయన బాధ. ఈ బంధాలూ అనుబంధాలు ఆవలపోసి తండ్రి తనతో పాటు హైదరాబాదులో ఉండాలనేది తనయుడి కోరిక. పొంతన కుదరని ఈ రెండు అభిమతాలు ముసలాయనకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. ఇప్పుడు నేనాయనకు వీలునామా రాసిపెట్టాలి. యిదీ ఆయన మాటల సారాంశం.

వీలునామా వివరాలు అడిగాను.

తానెవరిపైనా ఆధారపడాలనుకోవడంలేదనీ, హనుమకొండలోని 'ఆనందాశ్రమం' ఓల్డేజ్ హోంలో చేరుతున్నాననీ, తన భూములపై వచ్చే మునాఫా ఫలసాయం తాను బ్రతికున్నంతకాలం ఆశ్రమ యాజమాన్యానికి అందజేయాలనీ, మరణానంతరం ఇల్లు, యావదాస్తి అమ్మి ఆశ్రమ ఆస్తులకు జమకట్టాలనీ, తాను గతించిన తరువాత భౌతిక కాయాన్ని మహాత్మాగాంధీ ఆస్పత్రికి దానం చేయాలనీ, చివరిగా, తనూ తన భార్యా కలిసి దిగిన ఫోటో మాత్రం కొడుకూ కూతురూ ఎవరు కోరితే వారికివ్వాలంటూ, యిలా వ్రాసి పెట్టినందుకు నా ఫీజు ఐదు వందల రూపాయలు చేతిలో పెట్టాడు.

ఉదయం నుంచీ పెండింగ్ ఫైళ్ళు ఏమేమి ఉన్నాయో చూసుకుని, పిటీషన్లు వేయాల్సినవీ, క్రాస్ ఎగ్జామినేషన్ చేయాల్సినవీ, ఆర్గ్యుమెంటుకు సిద్ధంగా ఉన్నవీ లెక్కించుకుని, ఓడిపోయేలా వీగిపోయేలా కనిపించే కేసుల్లో ఫీజు ఆసాంతం ముందే రాబట్టుకోవాలనీ, గెలుపు ఖాయం అనుకున్న కేసుల్లో కొత్త కొత్త కారణాలు చూపి ఫీజు మరింత రాబట్టుకోవాలనీ ఆలోచిస్తూ, ప్లాన్లు వేస్తూ, ఫైళ్ళు చూస్తున్న నాకు ఇప్పుడీ పెద్ద మనషి సాక్షాత్తూ విష్ణుమూర్తిలా కనిపిస్తున్నాడు. అంతగా చదువుకోని ఆయనకూ, పెద్ద పెద్ద చదువులు చదివిన నాకూ ఆలోచనల్లో ఎందుకింత వ్యత్యాసం? నాకు చదువు మాత్రమే అబ్బింది, కాని ఆయనకు జీవిత రహస్యం అర్థమైంది అనుకుని, ఆయన కోరిన విధంగా వీలునామా వ్రాసి, దస్తావేజుతో పాటు ఆయనిచ్చిన అయిదు వందలు కూడా ఆయన చేతిలోనే పెట్టి, నమస్కరించాను. నాలో ఏదో నూన్యతా భావం కలిగింది. నా మనస్సింకా చాలా ఎదగాలనిపించింది.

*